

# సింహస్వప్నం

జీవితంలో ఎన్నో సంఘటనలు. ఒక దానికీ, మరొక దానికీ సంబంధ మున్నట్లే గోచరించదు. అయినా వాటిలో ఏదో ఒక సామాన్య లక్షణమో, అవి సంభవించే క్రమంలో ఒక వైశిష్ట్యమో, అధమం మన దృక్పథం తెలుసుకొనడానికి ఒక మార్గమో ఏదో ఒకటి గోచరించక మానదు. ఇదంతా జీవితం గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలవారికి. నాకు మాత్రం – నా మనస్తత్వం విశదపరచడానికి. ఒక చిన్న ఉపమానం చెబుతాను—

పేవ్‌మెంటుమీద శవం; అనాథ ప్రేతం; ఆపాద మస్తకం ముసుగు - ఉండవలసిన లక్షణాలన్నీ క్రమం తప్పకుండా ఉన్నాయి. వచ్చే పోయే ప్రతి బస్సు దగ్గరా ఒక పళ్లెంతో, దైన్యం మూర్తీభవించిన దృక్కులతో, కొంచెం కంపించే స్వరంతో 'అనాథ శవం బాబూ! రేపెవరికైనా ఈ గతి పట్టవచ్చు. ఏదో ఇలా-తలా ఒక డబ్బు - మీకు తోచినంత - దహన సంస్కారానికి' అని అభ్యర్థిస్తూ ఒక పెద్దమనిషిలాంటి వ్యక్తి. చుట్టూ ఒకే రకానికి చెందిన - వర్ణించడానికి అలవికాని-వ్యక్తుల బృందం. అది ఏ జాతి శవమో, ఏ లింగానికి చెందినదో తెలుసుకోకుండా, అసలు అది ఎందుకు శవమైందో తెలుసుకోడానికి ఆధారం లేకుండా, దాని పుట్టుపూర్వోత్తరాలతో నిమిత్తం లేకుండా, డబ్బు-ఎంతైనాసరే - పారేయడానికి మనస్కరించదు. పోనీ ఇవ్వకుండా ఉందామంటే, ఏమో - రేపు ఎవరికైనా అలాంటి గతి పట్టవచ్చునని ఆ వ్యక్తి బెదిరించాడాయె అని శంక.

శవం చుట్టూ మూగిన ఆ ఆప్తబంధువులు ఆకస్మికంగా కాళ్ళకు బుద్ధి చెబుతారు. అదేమిటో అర్థంకాదు. అంతలో ఒక పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ కాబోలు - శవం కాళ్ళమీద చేతిబెత్తంతో ఒక సున్నితమైన దెబ్బ. అంతటితో సరిపెట్టక - 'లేరా, మిగిలింది తరువాత చద్దువుగానిలే' అని ఒక హెచ్చరిక. 'పోలీసు' అని ఎవరో కేక. ఆ కేకతో నాటకం ముగించవలసిన సమయం ఆసన్నమైనదని తెలుసుకున్న నటశిఖామణి - నిద్రలోంచి లేచిన శవం-ఒక్క దులుపుతో, ముసుగుబట్ట పోనివ్వకుండా, పోలీసు అధికారి చేతుల్లో పడ

కుండా – మహాలాఘవంతో ఒక్క పరుగు. అంతే ప్రేక్షకుడైన ప్రతివాడూ జాలిపడినందుకు మనస్సులో తిట్టుకుంటూ 'అందుకే నిజంగా చచ్చిపోయిన శవాల్ని తగులబెట్టడానికి ఎవ్వరూ కానీ ఇవ్వరు' అని గట్టిగా పైకి అంటూ చల్లగా ఆ రంగంనుండి నిష్క్రమించడం.

అదిగో ఆ శవం మనస్తత్వం వంటిది నా తత్వం కూడా. చూద్దాం-ప్రపంచం ఎలా నడుస్తుందో అని.

ఇంతకీ అసలు విషయం చెప్పకుండా శాఖాచంక్రమణం చేయడం భావ్యం కాదు. చదువుకున్నకొలది, జీవితాన్నర్థం చేసుకొనడానికి తగిన శక్తి సామర్థ్యాలు, విశాల హృదయము ఏర్పడి, ప్రపంచజ్ఞానం కూడా పెంపొందుతుం దంటాడు మా వాడు. ఈ మావాడు ప్రతివారికీ ఉండే మావాడి వంటి మావాడే. అది అవునో కాదో సిద్ధాంతీకరించి చెప్పడం-సాధ్యం కాదేమో కూడా-అనవసరం, శుష్కదండుగ. ప్రతి నరమానవుడికీ ఒక సిద్ధాంతం-కొన్ని సందర్భాలలో వేలకువేల సిద్ధాంతాలు-అతనితోనే పుట్టి, పెరిగి, నరనరాలా వ్యాపించి, శల్యాల్లో జీర్ణించిపోయి, జీర్ణ సత్వాల్లా ఉన్నాయి. అందువల్ల నీ నా సిద్ధాంతాలతో ఎవరికీ పనిలేదు.

ఈమధ్య—ఇటీవల - కొలదిరోజుల క్రితమే-బొత్తిగా మొన్న మొన్ననే—ఒక చిన్న వారపత్రిక ప్రారంభించి,సంపాదకుణ్ని అవుదామనే సదభిప్రాయం కలిగింది. పూర్వంలా కాదు. ఇప్పుడు నాలుగణాల డబ్బులతో కావలసిన పేపరుకు-దైనిక, వార, పాక్షిక, మాసిక, ద్వైమాసిక, త్రైమాసిక,

సాంవత్సరిక, శతవార్షిక పత్రికల్లో దేనికైనా అట్టే ప్రయాస లేకుండా సంపాదకుడు కావచ్చు.

ఒక శుభదినాన ఫలానా అధికారి దివ్య సముఖానికి విజయంచేసి, మన కులగోత్ర నామాదులతో, బిరుద సహస్ర నామావళితో ఫలానా పత్రికకు సంపాదక, ప్రకాశక ఇత్యాదయః అని పదిమందికీ వినిపించేలా ప్రకటించుకోవలసినదని ఒక శ్రీముఖం. ఆ శ్రీముఖం అందే సమయానికే నా ప్రారంభోత్సాహం సన్నగిల్లి, అడగారి, ఆవిరై అదృశ్యమైన పదవ రోజు. అది పదకొండోరోజు అయినా కావచ్చు. ఏదైనా గణిత శాస్త్రజ్ఞులు కాని వారికి ఒకటి, రెండు తేడా ఉన్నంత మాత్రంచేత బాధ లేదు.

అందువల్ల వెళ్ళాలనే కోరిక లేదు. వెళ్ళకపోతే, ఏమో-తిరిగి అదే సందేహం. ఇంత అధికార మున్న కార్యాలయం-ఎందుకు రాలేదని కొరతవేస్తుందేమో అని భయం. చివరికి భయమే-మహామహానాయకుల ఉద్బోధలు పరిగణించకుండానే- నెగ్గింది. వెళ్ళాను.

అక్కడ పెద్ద గుమాస్తా అనే అధికారి-ఆయనతో సవినయంగా సంగతి మనవి చేసుకున్నాను. ఆయన అంతా విని, చిరునవ్వు-ప్రాయశః నా మేధాశక్తికి సంతోషాశ్చర్యాలు కలిగి ఉండవచ్చు-పారేసి, "సంపాదకుడుగా 'బాజా భజంత్రీలతో' ప్రకటించుకుంటామని దరఖాస్తు పెట్టుకున్న వారు మీరే గనుక-మీ కవసరం లేకపోతే-మానేయవచ్చు. ఇంత శ్రమపడి ఎందుకు వచ్చారు?" అని ఒకటే నవ్వు. ఎదుటివాడి కన్న ఎక్కువ తెలిసివుండి అది ఎంత నాసిరకం-ఉప్పు ఖరీదు

లాంటి విషయమైనా సరే-పొరపాటు చేశాడా, పప్పుల్లో కాలు వేశాడా-మనకు నవ్వు రావలిసిందే. తప్పదు. అది సహజం, ప్రకృతిసిద్ధం. మానవత్వం. చెప్పొద్దూ?

నాకూ నవ్వు వచ్చింది. నేను కూడా చదువుకున్నవాణ్నే. కాదని అనవలసిన అవసరం మాత్రం ఎవరికి ఉంది? నా కీమాత్రం విషయం తట్టలేదేమూ అని నవ్వు వచ్చినమాట వాస్తవం.

ప్రపంచజ్ఞానం కూడా ఉండవచ్చు-చదువుకున్నంత మాత్రంచేత ప్రపంచజ్ఞానం ఉండదని కూడా చెప్పడం ఆరోగ్యకరం కాదేమో.

అదో పట్టణమూ కాక, పల్లెటూరూ కాక మధ్య రకంగా-త్రిశంకు స్వర్గంలా-నేపాల్‌లా ఉండే ఊరు. అది కొంచెం పట్టణానికే దగ్గరగా ఉంటుంది. అదే మొదటిసారి అక్కడికి వెళ్ళడం.

హోటల్‌లో కాఫ్యాదులు సేవించి, (ఇది కథల్లో మాత్రం అంతా విధిగాచేసే ఘనకార్యం) కార్డు ముక్కొకటి కొని, ఇంటికి ఉత్తరం వ్రాద్దామని బయలుదేరాను. అంతలో పెద్ద కలకలం. రోడ్డుమీద జనం ఎక్కడి కక్కడికే చెల్లా చెదరయిపోయారు. సైకిళ్ళు వదిలిపెట్టి, కారుల్లో దూరి, తలుపులు బిడాయించుకొని, తెరచిఉన్న ప్రతి ఇంటి గుమ్మం లోనూ ప్రవేశించి,తలుపులు ఓరగా ఉంచి, నక్కినక్కి చూసే వారు. నిమిషమైనా కాలేదు. రోడ్డుమీద ఏకాకి-ఏకాకి?-నయ్యాను. చూద్దునుకదా. దూరంగా ఆంబోతు ఒకటి రంకెలు వేస్తూ పరుగెత్తుకుని వస్తోంది. ప్రతి గుమ్మంలోంచీ, కిటికీ

లోంచీ, కళ్ళున్న ప్రతివాడూ చూస్తున్నాడు. నా వెనకాల నుంచి ఎవరో పొలికేక- 'ప్రాణాలు దక్కించుకో' అని. ఇది వీరత్వం చూపవలసిన సమయం-అవసరం కూడా లేదు-కాదనుకున్నాను-ఎదురుగా టెలిఫోన్ బూత్-ఒక్క అంగ-హనుమంతుడు సముద్రం దాటినట్లు వేసి లోపల తలుపు బిడాయించుకుని చూస్తున్నాను.

ఆ ఆబోతు మహా భీకరంగా ఉంది. నేనప్పుడే విడిచి పెట్టిన హోటల్ గుమ్మం దగ్గరకు పోయి, సైకిళ్ళన్నీ చిందర వందర చేసింది. ఆఫీసు బంట్రోతు విడిచి పెట్టిన ఉత్తరాల సంచి సవిలాసంగా కొమ్ములకి గుచ్చుకుని,అలంకరించుకుంది.

అటూ ఇటూ చూసింది. పేవ్ మెంట్ దుకాణ దారుడు హడావిడిలో పడవేసిన అరటిపళ్ళ అత్తం రుచి చూసి, తినేసింది. హోటల్ గుమ్మంలోంచి బిగ్గరగానే రోదన ధ్వనులవంటి శబ్ద తరంగాలు - బహుశా యజమాని అయి ఉంటాడు.

సరాసరి నేనున్న 'బూత్' దగ్గరకు వచ్చింది. అటూ ఇటూ చూసింది. తోక పైకెత్తింది. గాజు తలుపును నాకింది. తిన్నగా రోడ్డుమధ్యకు పోయి, హోటల్ వైపు తలపెట్టి, నిలబడి ఉంది.

దానికి వెనకగా ఒక పెద్దమనిషి-గొడుగు, పైన ఎర్ర గుడ్డ-తలవంచుకుని, రోడ్డుమీద వస్తున్నాడు.

నేనే కాదు-అక్కడి అశేష ప్రాణికోటీ ప్రాణాయామం పట్టి ఫలితంకోసం నిరీక్షిస్తున్నాం.

ఆ పెద్దమనిషి ఆంబోతును చూడలేదు. అది ఆయనను

పసికట్టలేదు. తల వంచుకుని ఉన్నాడేమో, అడ్డంగా ఉన్న ఆంబోతు వీపుకు కొట్టుకున్నాడు. మా ప్రాణాలు నిలువునా పైకెగిరిపోయాయి. అప్పుడు చూసినట్లున్నాడు-చేత్తో ఒక దెబ్బ కొట్టి 'ఫో ఫో' అన్నాడు. అది చలించలేదు. కొంచెం చిరాకుతో చేతిలో గొడుగు ముడిచి, దానితో ఆంబోతు పిర్రమీద ఒకటి ముట్టించి, మార్గదిఖాయా-రోడ్డు చూపించి అదిలించాడు. ఆంబోతు చల్లగా తల పక్కకు త్రిప్పి, ఆ పెద్ద మనిషి చూపించిన మార్గాన్నే నెమ్మదిగా నడక ప్రారంభించింది. దాని వెనకాలే వీపుమీద ఒకటి, నడ్డిమీద ఒకటి వడ్డిస్తూ, ఆయన అలాగే దాన్ని పక్క సందులోకి తరిమివేసి, తన దారిని చక్కా-పోయాడు. కథ కంచికి వెళ్ళకముందే నేను టెలిఫోన్ కియాస్కు-లోంచి బయటపడ్డాను.

ఆయన ఆ ఊరి హైస్కూలులో ప్రధానాధ్యాపకుడు. చదువుకోవడమే కాదు-చదువు చెప్పడం కూడా.

ఆ ఆంబోతంటే-

ఆ ఊరిలో సింహ స్వప్నం.

---